క్లుప్తంగా

తలనీలాల వేలం రేపు

పుత్తూరు: వడమాలపేట మండల పరిధిలోని సదాశివ కోనకు సంబంధించి తలనీలాల వేలం పాటను ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జయచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేలంపాటలో పాల్గొన దలచిన వారు రూ.15 వేలు డిపాజిట్ చెల్లించాలని వెల్లడించారు. కామాక్షి దీపాల సేకరణకు రూ.10 వేలు, తాత్కాలిక అంగళ్ల ఏర్పాటుకు రూ.5 వేలు డిపాజిట్లు చెల్లించాలని వివరించారు.

కుష్టువ్యాధిపై అవగాహన ఉండాలి



రికార్డులను పరిశీలిస్తున్న వెంకటప్రసాద్

పాలసముద్రం: కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని జిల్లా లెప్రసి అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక పీహెచ్‌సీలో కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వేపై వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలుంటే వెంటనే ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కుష్టువ్యాధి లక్షణాలు ఉంటే ఆందోళన చెందకుండా వైద్య చేయించుకోవాలన్నారు. అనంతరం సర్వే రిజిస్టర్‌ను పరిశీలించారు. వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనే జగనన్న లక్ష్యం



బస్సును ప్రారంభిస్తున్న విజయకుమార్‌రెడ్డి

పెనుమూరు (కార్వేటినగరం): బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనే జగనన్న లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు బయలుదేరారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని చంద్రబాబునాయుడు దళితుల ఓట్లను వేయించుకుని విస్మరించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దాము, జేసీఎస్ కన్వీనర్ హరికృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

కాలేజీ బస్సు బోల్తా



ప్రమాదానికి గురైన కాలేజీ బస్సు

గంగాధర నెల్లూరు: మండలంలోని మోతరంగనపల్లి సమీపంలోని చిత్తూరు– పుత్తూరు జాతీయ రహదారిలో గురువారం కాలేజీ బస్సు బోల్తా పడింది. ఎస్‌ఐ రామాంజనేయులు కథనం మేరకు చిత్తూరు నగరంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీకి చెందిన బస్సు గురువారం విద్యార్థులను ఎక్కించుకుని కాలేజీకి బయలుదేరింది. అతివేగంగా వస్తూ మోతరంగనపల్లి సమీపంలో చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారిలో ఉన్న మలుపు వద్ద చింత చెట్టును ఢీకొని బోల్తా పడింది. 10 మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో చిత్తూరు ప్రభుత్వాసుపతికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సెలవు రోజుల్లో కాలేజీ నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలకు అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

కాణిపాకం హుండీ ఆదాయం రూ.1.62కోట్లు



కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ ఆదాయం రూ.1.62 కోట్లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆలయంలో గత 22 రోజుల హుండీ కానుకల లెక్కింపును గురువారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. అందులో బంగారం 57 గ్రాములు, వెండి 580 గ్రాములు, ఫారిన్ కరెన్సీ యూఎస్‌ఏ 964 డాలర్లు, ఆస్ట్రేలియా 60 డాలర్లు, ఇంగ్లాండ్ 60 పౌండ్స్, యూఏఈ 5 ధీరమ్స్, సింగపూర్ 57 డాలర్లు, మలేషియా 1 రింగిట్స్, కెనడా 10 డాలర్లతో కలిపి మొత్తం రూ.1.62 కోట్లు వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవ రెడ్డి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

రూ.19 కోట్లతో ఆలయాల అభివృద్ధి







నాడు: వరద వేంకటేశ్వరస్వామి పురాతన ఆలయం, నేడు: ఆధునికీకరించిన ఆలయం, అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

కార్వేటినగరం: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ఆలయాలు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంలో ఆలయాల పాత్ర కీలకం. అందుకే పూర్వం రాజులు అనేక ఆలయాలు నిర్మించి పూజాది కార్యక్రమాలు జరిపేలా ఏర్పాట్లు చేశారు. గత పాలకుల నిరాదరణతో జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఉన్న శతాబ్దాల నాటి పురాతన ఆలయాలు అభివృద్ధికి నోచుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం నారాయణస్వామి రూ.19 కోట్లతో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్వేటినగరం మండలం ఆళత్తూరులో సాళువ రాజులు నిర్మించిన వరద వేంకటేశ్వరస్వామి, కొటార్వేడులోని అగస్తీశ్వరస్వామి ఆలయాలకు ఎంతో చరిత్ర ఉంది. గతంలో ఇక్కడ పెద్ద ఎత్తున పూజలు, ఉత్సవాలు నిర్వహించేవారు. గత ప్రభుత్వాలు వాటి గురించి పట్టించుకోలేదు. అదేవిధంగా పెనుమూరు మండలంలోని కనిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, పాలసముద్రం మండలంలోని మతవలంలో ఉన్న పురాతన గోవర్ధనేశ్వర స్వామి ఆలయం, శ్రీరంగరాజపురం మండలం ఆరిమాకులపల్లిలోని ఆరిమానిగంగమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని గతంలో అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణ స్వామి చొరవ తీసుకుని వరద వేంకటేశ్వర స్వామి, కనిగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాలను టీటీడీకి అనుబంధం చేశారు. తద్వారా పూర్వ వైభవం తీసుకువచ్చారు. అలాగే అగస్తీశ్వర స్వామి ఆలయానికి రూ.2.75 కోట్ల మ్యాచింగ్ గ్రాంటును మంజూరు చేయించారు. టీటీడీ ఆధ్వర్యంలో 87 ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఒక్కో ఆలయాన్ని రూ.10 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



వరద వెంకటేశ్వర స్వామి ఆలయానికి పూర్వ వైభవం వస్తుందని కలలో కూడా ఊహించలేదు. రూ.లక్షలు వెచ్చించి పునర్ నిర్మాణం చేపట్టారు. టీటీడీ ఆధ్వర్యంలో నిత్యం పూజలు చేసేలా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది. వరద వెంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి రుణపడి ఉంటాం.

–పురంధర్, జేసీఎస్ కన్వీనర్, ఆళత్తూరు

ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రభుత్వం



కొన్నేళ్లుగా నిరాదరణకు గురైన పురాతన వరద వెంటేశ్వర స్వామి ఆలయాన్ని టీటీడీకి అనుబంధం చేసి నిత్యం పూజా కార్యక్రమాలు జరిగేలా చేస్తానని జగనన్న చెప్పారు. ఇప్పుడు మాటను నిలబెట్టుకున్నారు. జగనన్న ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

–చిరంజీవిరెడ్డి, ఆళత్తూరు గ్రామం, కార్వేటినగరం

ఆలయానికి పూర్వ వైభవం వస్తుందనుకోలేదు

వరద వేంకటేశ్వరస్వామి ఆలయానికి పూర్వ వైభవం వస్తుందని అనుకోలేదు. టీటీడీ తన ఆధీనంలోకి తీసుకోవడంతో ఎంతో అభివృద్ధి చెందింది. ఇప్పుడు భక్తులు కూడా పెద్ద సంఖ్యలో వస్తున్నారు. దీంతో మా గ్రామం అభివృద్ధి బాటలో నడుస్తుందని అందరూ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

–గురుస్వామిరెడ్డి, ఆళత్తూరు, కార్వేటినగరం

యాజమాన్య పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి

వెదురుకుప్పం: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వెదురుకుప్పంలో గురువారం మామిడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యానశాఖ సిబ్బంది అందుబాటులో ఉన్నారని, మామిడి సాగులో వారి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పూత ప్రారంభమయ్యే అవకాశం ఉందని, వాతావరణ మార్పులకు అనుగుణంగా పూత రాలిపోకుండా మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 29 మండలాల్లో మామిడి ప్రధాన పంట అని తెలిపారు. నాణ్యమైన దిగుబడి పొందేందుకు రైతులు ప్రయత్నించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ లత, వడమాలపేటలో ఖోఖో ఆడుతున్న యువత

కార్వేటినగరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని ఎంపీపీ లత తెలిపారు. కార్వేటినగరంలో గురువారం ఎంపీడీవో మోహన్‌మురళీ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, పీడీ మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

పుత్తూరు: వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం ఆడుదాం–ఆంధ్ర మండల స్థాయి ఖోఖో పోటీలు హోరాహోరీగా నిర్వహించారు. మండలంలోని 12 సచివాలయాలకు చెందిన జట్లు పోటీ పడగా బాలినాయుడుకండ్రిగ, తిరుమణ్యం జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఫైనల్స్‌లో బాలినాయుడుకండ్రిగ జట్టు 12–8 తేడాతో తిరుమణ్యం జట్టుపై గెలుపొంది, నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. పీడీలు చంద్రశేఖర్‌రాజు, శివప్రసాద్, నాగేంద్ర, రూపలత, హేరాంభకుమార్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

అలరించిన చిన్న కొండచుట్టు



చిన్నకొండ చుట్టు ఉత్సవాల సందడి

నగరి: పట్టణంలోని భేరివీధిలో గురువారం నిర్వహించిన చిన్నకొండచుట్టు ఉత్సవం చిన్నారులను అలరించింది. కొండచుట్టు ఉత్సవానికి మరుసటి రోజున పట్టణంలోని భేరివీధిలో వలస వ్యాపారులు దుకాణాలు పెట్టడం పరిపాటి. దీంతో వీధిలో తిరునాళ్ల సందడి కనిపిస్తోంది. స్థానికులు దీన్ని చిన్న కొండచుట్టు ఉత్సవాలుగా పిలుచుకుంటారు. చిన్నారుల ఆటబొమ్మలు, మహిళలకు సంబంధించిన అలంకరణ వస్తువులు, చెరుకుగడలు, తినుబండారాలు ఇక్కడ అధికంగా విక్రయిస్తారు. వాటిని కొనుగోలు చేసుకోవడానికి, వివిధ రకాలైన రంగుల రాట్నాల్లో తిరగడానికి పిల్లలు ఉత్సాహం చూపారు. దీంతో వీధి మొత్తం జనంతో నిండిపోయింది.

మంత్రి పరామర్శ



నగరి: మున్సిపల్ పరిధి 6వ వార్డు నగరి కాలనీకి చెందిన కౌన్సిలర్ సాయి సంధ్యారాణి తండ్రి అన్బు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం వారి స్వగృహానికి వెళ్లిన మంత్రి దంపతులు అన్బు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చీటింగ్ అప్పీలు కేసులో మహిళకు మూడేళ్ల జైలు

తిరుపతి లీగల్: పేద దివ్యాంగులకు రుణం ఇస్తామంటూ మాయమాటలు చెప్పి, వారి వద్ద సొమ్ము తీసుకొని మోసం చేసిన కేసులో పిచ్చాటూరు మండలం కొత్తూరు దళితవాడకు చెందిన పి.మంజులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ గురువారం తీర్పు చెప్పారు. జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఏపీపీ వెంకటనారాయణ, కోర్టు మానిటరింగ్ అధికారి మునిరత్నం నాయుడు తెలిపిన కేసులోని వివరాల మేరకు... నగరి టౌన్‌లోని 27వ వార్డులో ఉన్న సామాజిక సమీకరణ కింద పేదలైన దివ్యాంగులను గుర్తించి స్వయం సహాయక బృందం కింద ప్రభుత్వం రుణాలు ఇవ్వాలని 2014లో ఆదేశాలు జారీ చేసింది. నగరి టౌన్‌లోని వివిధ బృందాలకు రిసోర్స్ పర్సన్‌గా నిందితురాలు మంజులను మున్సిపల్ అధికారులు నియమించారు. పుత్తూరు ఆరేటమ్మ కాలనీకి చెందిన సి.గోపిని కో–ఆర్డినేటర్‌గా నియమించారు. స్వయం సహాయక బృందం సభ్యుల వద్ద నిందితురాలు మంజుల రుణాలు తీసిస్తానని మాయ మాటలు చెప్పి రూ.3,30,400 తీసుకొని, వారికి ఎటువంటి రుణాలు అందివ్వలేదు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బాగుపడిన రోడ్డు



నాడు: ఆర్‌అండ్‌బీ రోడ్డు పోతుమానిగుంట ఎస్టీ కాలనీ వరకు పాత మట్టి రోడ్డు



నేడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన సిమెంట్ రోడ్డు

ఏర్పేడు: నాడు గుంతలమయమైన మట్టి రోడ్డుతో నిత్యం ఇబ్బందులు పడేవారమని, నేడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.53 లక్షలు మంజూరు చేసి సిమెంట్ రోడ్డు వేయడంతో సంతోషంగా ఉందని అంజిమేడు పంచాయతీ వాసులు చెబుతున్నారు. అంజిమేడు పంచాయతీ కృష్ణగిరికాలనీ, పోతుమానిగుంట ఎస్టీ కాలనీలో 390 కుటుంబాలు ఉన్నాయి. ఎక్కువ మంది నిరంతరం తిరుపతి, శ్రీకాళహస్తి పట్టణాలకు వెళ్లి చిన్న చిన్న పనులు చేసుకునే వారే. గతంలో కాలనీల నుంచి అంజిమేడు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు సుమారు కిలోమీటరు మేర మట్టి రోడ్డు ఉండేది. వర్షాకాలం రోడ్డులో గుంతలు పడడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రాత్రిళ్లు ఏవైనా ప్రమాదాలు జరిగితే సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. రోడ్డును బాగు చేయాలని అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండాపోయింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక తమ గ్రామానికి సిమెంట్ రోడ్డు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అనతికాలంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.53 లక్షల నిధులు మంజూరయ్యాయి. నిధులతో 2022 జూన్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



విశేషాలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ట చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ, వైదిక క్రతువులు చేపట్టారు. పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన యువకులు



విజయవాడకు బయలుదేరుతున్న యువకులు

పాలసముద్రం: బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని జెడ్పీటీసీ అన్బలగన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. పాలసముద్రం సచివాలయం ఆవరణలో గురువారం ఏవో విద్యావతి సమక్షంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ అన్బలగన్ మాట్లాడుతూ బలహీన వర్గాల సంక్షేమానికి బీఆర్ అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విజయవాడకు వెళ్లేందుకు బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజులు, గోపాల్, చంద్రశేఖర్ రాజు, నరసింహన్, మదివానన్, కుట్టి, మురుగేష్ పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన వైఎస్సార్‌సీపీ నేతలు

గంగాధర నెల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విజయవాడలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. విగ్రహావిష్కరణకు మండలం నుంచి గురువారం పలువురు నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఆయన జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచులు మునిరాజారెడ్డి, నరసింహులు, హేమశేఖర్ రెడ్డి, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టిపరిస్థితుల్లో మోసాన్ని ఉపేక్షించొద్దు

- వినియోగదారుల ఫిర్యాదులకు అవకాశం
- తూనికలు, కొలతల శాఖల్లో మోసాలకు చెక్
- టోల్ ఫ్రీ నంబర్ 1967 ఏర్పాటు
- వినియోగించుకోవాలంటున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుకు జరిగిన మోసాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించొద్దని రక్షణ చట్టం స్పష్టంగా చెబుతోంది. దీన్ని మరింత పటిష్టంగా మార్చింది రాష్ట్ర ప్రభుత్వం. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ఆయా విభాగాలకు ఫిర్యాదుల కోసం వివిధ టోల్ ఫ్రీ నంబర్లను కేటాయించారు. అయితే మోసపోయిన సమయంలో ఏ నంబర్ ఎవరి పరిధిలో వస్తుందో తెలియక కొనుగోలు దారులు ఫిర్యాదు చేసేందుకు అవస్థలు పడేవారు. దీన్ని గమనించి ప్రస్తుతం ప్రభుత్వం వాటన్నింటినీ కలిపి ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ట్రోల్ ఫ్రీ నంబర్ 1967 ఏకైక నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో బాధితులు ఈ నంబర్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కారం లభిస్తుంది.

పాల నుంచి ఫార్మా కంపెనీల దోపిడీ వరకు బరువు, విలువ, కల్తీ, ఇలా సేవా లోపంపై ఎక్కడైనా సేవల్లో మోసం జరిగినా, వస్తువుల్లో నాణ్యత లోపించినా వినియోగదారులు అయోమయానికి గురవుతుంటారు. అలాంటి వారికి చేతికి రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. ఫిర్యాదులు, వినతులు, సలహాల కోసం ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ 1967 నంబరును అందుబాటులో ఉంచింది. గతంలో ప్రజలు, వినియోగదారులు, ధాన్యం కొనుగోళ్లలో ఎదుర్కొనే ఇబ్బందులను తెలియజేసేందుకు వివిధ టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉండేవి. ఇందులో పౌరసరఫరాల శాఖకు సంబంధించి టోల్ ఫ్రీ నంబరు 18004250082 /1967కు, ఒకే దేశం ఒకే రేషన్ ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబరు 18004253157/ 14445, రాష్ట్ర ఆహార భద్రత ఫిర్యాదులు, సలహాలు, సూచనలకు టోల్ ఫ్రీ నంబరు 1800 4252388 /155235, తూనికలు, కొలతలశాఖకు సంబంధించిన ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 18004254205 అందుబాటులో ఉండేవి. దీంతో ఫిర్యాదులు ఒకరికి చేయడానికి బదులు మరోశాఖకు వెళ్లేవి. అంతేగాక వినియోగదారుల అన్ని నంబర్లను గుర్తుంచుకోవడం కష్టంగా ఉండేది. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అన్ని టోల్ ఫ్రీ నంబర్లను అనుసంధానం చేస్తూ 1967 నంబరుతో విజయవాడలో ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు.



టోల్‌ఫ్రీ నంబరుతో ముద్రించిన కరపత్రం



చిత్తూరులో నూనె దుకాణంలో తనిఖీలు చేసిన లీగల్ ఇన్‌స్పెక్టర్ దివ్య (ఫైల్)

అన్ని రకాల ఫిర్యాదులు

ఈ కాల్ సెంటర్‌కు ప్రజలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాలశాఖకు సంబంధించిన అన్ని రకాల ఫిర్యాదులు చేయవచ్చు. ముఖ్యంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో తుకాల్లో మోసాలు, అధికంగా డబ్బులు తీసుకోవడం, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్ బంకులు, బియ్యం, వంటనూనె, నిత్యావసర సరుకులు, మాంసం ఇతర వస్తువులు, తూనికల కొలతల అవకతవకలపై ఫిర్యాదులు చేయవచ్చు. చేసిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పరిష్కారం నిమిత్తం పంపుతారు. అంతేగాక నిర్దేశించిన సమయం తర్వాత ఫిర్యాదు ఏ దశలో ఉందో, ఎవరి వద్ద పెండింగ్‌లో ఉందో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది.

సమస్యలను తెలపండి




వస్తువుల పరంగా బరువు, తూకంలో తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటాం. ప్రతి ప్యాకింగ్ పైనా వస్తువు పేరు, బరువు, తయారీ పరిశ్రమ వివరాలు, ఉండాలి. అందులో తేడాలు ఉంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. బియ్యం, నూనె, పెట్రోలు, వంటనూనె, ఇలా పలు రకాల వస్తుసేవల లోపంపై 1967 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

– స్వామి, ఏసీ, తూనికల కొలతలశాఖ

విద్యుత్ ఆదా చేయండి

- రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ సుబ్రమణ్యం



మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం

పుంగనూరు: ప్రతి ప్రాంతంలోను, ప్రతి ఇంటా విద్యుత్‌ను ఆదా చేయడం అలవరచుకోవాలని రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రమణ్యం కోరారు. గురువారం మున్సిపాలిటీలో చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగం–పొదుపుపై రెండు రోజులు అవగాహన సదస్సు నిర్వహించారు. సుబ్రమణ్యం మాట్లాడుతూ, విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ప్రస్తుతం సౌర విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో వీధి దీపాలు, బోర్లలో విద్యుత్ వినియోగం ఎక్కువైందని, ట్యాంకులు నిండినా మోటార్లు ఆపకపోవడం, విద్యుత్ దీపాలు పగలు కూడా ఆఫ్ చేయకపోవడం వల్ల విద్యుత్ దుబారా అవుతోందని విశ్లేషించారు. దీనివల్ల ప్రభుత్వ సంస్థలకు అధిక భారం పడుతోందన్నారు. ఈ దుబారాపై దృష్టి సారించి నియంత్రిస్తే విద్యుత్ ఎంతో ఆదా అవుతుందన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు వెంకట్రమణ, డీఈఈలు శ్రీనివాసులు, మహేష్, ఏఈ కృష్ణకుమార్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఎనర్జీ కార్యదర్శులు పాల్గొన్నారు.